

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నాన్న అంటే....

**మా ఆయన** శనివారం ఆఫీసు నుండి ఇంటికొస్తూనే "కృష్ణ ఫోన్ చేసాడా?" అని అడుగుతూ వస్తారు. ఆయన ఆ మాట గంటకి పదిహేనుసార్లు అడుగుతుంటే, నేను వంటగదిలో నుండి వాడికి మెసేజ్ పెడ్తా "మీ నాన్న కలవరిస్తున్నారు. ఫోన్ చెయ్యి" అని.

మా వాడు అమెరికానుండి ఎప్పుడు ఫోన్ చేసినా ఈయన టైం జోన్ పట్టించుకోరు, మాకు అప్పుడు ప్రొద్దున్న అయితే, ఈయన "ఏరా.. లేచావా? బ్రష్ చేసుకున్నావా?" అంటారు.

"డాడ్ ఇది రాత్రి. బ్రష్ చేసుకుని పడుకునే టైం" అంటాడు.

"సరే సరే అయితే పడుకో" అంటారు.

"దీనికా! అమ్మ నన్ను నీకు ఫోన్ చెయ్యమన్నదీ?" అంటాడు వాడు.

"ఓ.. మీ అమ్మ చెపితే చేసావా?" అని అలుగుతారు.

"ఏదైనా మాట్లాడండి" అని నేను సైగ చేస్తాను.

"జీతం వచ్చిందా?" అంటారు.

"ఆ!" వాడు విసుగ్గా అంటాడు.

"అడ్డమైనవి తినకు. మాదీఫలరసాయనం వేసుకో.. మీ అమ్మలా అర్ధరాత్రిదాకా టీ.విలు చూడకు. పెదరాళే పడుకో. నాలుగు గంటలకి లేవాలి"

"ఇంకా?"

వాడికి ఇరవై ఐదేళ్ళుగా విని విని బోర్‌గా ఉంటుంది.

"జీతం మళ్ళీ ఎప్పుడొస్తుందీ?"

"సరే నాన్నా.. నేను అమ్మతో మాట్లాడ్తా" అంటాడు.

"బై" రెడీగా ఉంటారు ఈయన.

వాడు నాకు ఫోన్ చేస్తే ఇద్దరం ట్రంప్ గురించీ, మోదీగారి గురించీ, తర్వాత కొత్త సినిమాలు, మధ్యలో క్రికెట్టూ, తర్వాత మా పక్కింటివాళ్ళ గురించీ, విశేషాలుంటే మా ఫ్యామిలీ గ్రూప్ గురించీ, లాస్టికి మజ్జిగ పులుసు ఎలా చెయ్యాలీ? - అన్నీ ఓ గంట మాట్లాడుకుంటాం. నేను ఇంకా టీ.వీలో వచ్చే ఇండియన్ ఐడల్ గురించీ, నేను రాస్తున్న కొత్త కథ గురించీ చెప్దాం అనుకుంటాగానీ వాడికి అమెరికాలో అర్ధరాత్రయి డేట్ మారిపోతుంది 'గుడ్‌నైట్' చెప్పి పెట్టేస్తాను.

నాకు ఇక్కడ నస మొదలు అవుతుంది. "వాడిని పెందరాళే పడుకోమని చెప్పు. నాలుగు గంటలకి లేవాలి"

మా పెద్దాడు అక్కడ వుంటే వచ్చి అడుగుతాడు "చిన్నప్పుడూ అలాగే చెప్పావు. రాత్రి తొమ్మిదికి పడుకుని, నాలుగు గంటలకి లేవాలని. అప్పుడు చదువు బాగా వస్తుందని. మీ నాన్నా, వాళ్ళ నాన్నా, నువ్వూ అంతా అలాగే చేసేవారని. ఎందుకు నాన్నా మరి మీలో ఎవరూ చదువుకుని కలెక్టర్ కాలేదూ?" అని.

"పోనీ పరిపూర్ణమైన ఆరోగ్యాలకి బ్రాండ్ అంబాసిడర్లా?" అని నేను సణుగుతాను వంటగదిలోనుండి.

చిన్నప్పుడు ఓసారి నేను చదువుకునే రోజుల్లో బడిలో 'నాన్న' గురించి వ్యాసం రాయమన్నారు.

నేను మా నాన్న గురించి రాసాను. "మా నాన్న రోజూ ముద్దపప్పు చెయ్యమంటారు. గుత్తి వంకాయ కూర, కాయ నాలుగు పక్షాలుగా కోసి, కారం కూరి చెయ్యకపోతే ఆయనకి కోపం వచ్చునూ. మజ్జిగ పలచగా వుంటే కంచంముందు చెయ్యి కడిగివేయుదురు. పెరుగు చాకుతో కోయునట్లు వుండవలెనని ఆయన అభిమతమూ! కొత్తావకాయలోని నూనెతో దిబ్బరొట్టె కాల్చిన బహు రుచి అని ఆయన ఎల్లప్పుడూ చెప్తూ వుంటారు." ఇలా రాసాను. మా రాణీ టీచర్ చూసి స్టాఫ్‌రూంలోకి పిలిపించింది.

అక్కడ అప్పటికే సమ్‌దానీగాడు గోడకుర్చీవేసి ఉన్నాడు.

"ఏవిటీ రాతలు?" అంది.

"నాన్న గురించి" అన్నాను.

"నాన్న వ్యాసం ఇలా రాయాలి" ఆవిడ రమాదేవి రాసిన పుస్తకం తీసి చూపించింది.

"నాన్నగారు మమ్మల్ని దగ్గర కూర్చోపెట్టుకుని చదివించెదరు. నాన్నగారు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి కుటుంబం మొత్తాన్ని పోషించెదరు. మనకి ప్రొద్దుటే లేపి వ్యాయామం ఎలా చేయవలెనో చెప్పుదురు. తర్వాత దేవుడి ఎదుట కూర్చోపెట్టి పూజా కార్యక్రమాలు చేయించెదరు. ఆ తర్వాత మనకు పెద్దలతో మాట్లాడవలసిన విధానం నేర్పుదురు."

"ఇవన్నీ మాకి అబ్బా జాన్ చెయ్యడు" సందానీ కోపంగా చెప్పాడు.

"వీడు చూడు ఏం రాసాడో?" రాణీ టీచర్ కోపంగా వాడి బుక్ చూపించింది.

"నాన్న దినాం ఇంటికొచ్చి, నన్ను సిగరెట్ తెమ్మంటయి. తర్వాత అమ్మీజాన్‌ని గుడ్డు అట్టు వెయ్యమంటయి. సీసాల మందు తెచ్చుకుని తాగుతయి. ఆ మందు తాగినంక అబ్బాజాన్ మొకమ్ల ఆనందం కనిపిస్తాయి. అబ్బాజాన్ అట్టులో అమ్మీజాన్ ఉప్పు వెయ్యలేదని గుస్సాచేసి జుట్టుపట్టుకుని రెండు కొడతయి. అమ్మీ జాన్ ఏడుస్తయీ.. అబ్బాజాన్ మా చిన్నమ్మ దగ్గరకి పోయి, ఆ రాత్రి అక్కడే ఉంటాయి."

నేను నవ్వు చెయ్యి నోటికి అడ్డం పెట్టి ఆపుకున్నాను.

ఆ విధంగా మా వారి వంశంలో ఎవరూ ప్రొద్దుట నాలుగుగంటలకి లేచి చదువుకున్నందుకుగాను, కలెక్టర్లు అయిన దాఖలాలు లేవు. ఈ బ్రహ్మ ముహూర్తంలో చదువుకోవడం వల్ల ఆ 'బ్రహ్మ'కి చదువు వచ్చిందేమో కానీ వీళ్ళకి రాలేదు.

ఇంక పిల్లలతో ఆయన ఇంటరాక్షన్, పాలిటిక్స్ గురించి తప్ప జనరల్ విషయాల గురించి ఉండవు. ఎప్పుడైనా ప్రొద్దుట పూట మా పెద్దవాడితో బ్రేక్‌ఫాస్టు చేస్తే "రాత్రి ఎందుకు ఆలశ్యం అయింది?" అంటారు.

"సందీప్ రిసెప్షన్‌కి వెళ్ళాను" అంటాడు.

"సందీప్ ఎవరు?"

"నా ఫ్రెండ్ నాన్నా"

"నాకు ఎప్పుడూ చెప్పలేదే?"

"వాడు మన ఇంటికొచ్చి చాలారోజులు ఇక్కడే వున్నాడు నాన్నా"

"వాడా! వాడి పేరు రాకేష్ కదా?"

"నాకు రాకేష్ అనే ఫ్రెండ్ లేడు నాన్నా"

"నేను ఎప్పుడైనా చూసానా వాడిని?"

"ఎవరిని?"

"రాకేష్‌ని"

"రాకేష్ అని ఎవరూ లేరు నాన్నా"

"మరి రాత్రి రిసెప్షన్‌కి వెళ్ళాను అన్నావుగా!"

"వాడు సందీప్ నాన్నా"

"అందరూ సందీప్ అనే పేరు పెట్టుకుంటే ఎలా? కృష్ణకు కూడా సందీప్ అనే ఫ్రెండ్ వున్నాడు అంటాడు"

"అవును నాన్నా వాడి ఫ్రెండ్ పేరు కూడా సందీపే!"

"సరే. అందరి పెళ్ళిళ్ళూ అయిపోయాయి. నీ పెళ్ళి తప్ప."

"అందరివీ ఎక్కడ అయ్యాయి నాన్నా?"

"రాత్రి రాకేష్ పెళ్ళి అయిందిగా?"

"వాడు రాకేష్ కాదు నాన్నా సందీప్"

"సర్లే.. పేరు ఏదయితేనేం? నాకు ప్రయారిటీ కాని విషయాలు గుర్తుండవు"

మా వాడికి చిరాకేసి లేచి వెళ్ళిపోతుంటే, పిలుస్తారు "రాకేష్‌నీ, వాడి పెళ్ళాన్నీ మన ఇంటికోసారి భోజనానికి పిలు."

"నాన్నా" వాడు జుట్టు పీక్కుంటాడు.

"అలా పిలవాలి. అది మర్యాద" అంటారు.

"అలాగే పిలుస్తా. అసలు వాడు ఎవరో తెలిస్తే" అని వాడు కోపంగా నిష్క్రమిస్తాడు.

"ఎందుకండీ మీకు పేర్లు గుర్తుండవూ?" అంటాను.

"ఎందుకు గుర్తు వుండవూ? ఊరికే వాడిని ఆట పట్టించాను."

"సరిపోయింది. పనిమనిషి వస్తుంది అంట్లు సర్ది వస్తాను" అని నేను లేస్తుంటే,

"పద్మకి వరండాలో కుండీల్లో నీళ్ళు పొయ్యాలని చెప్పు" అంటారు.

"పద్మా? పద్మని ఎక్కడినుండితేనూ?"

"పనిమనిషి వస్తుంది అన్నావుగా?"

"అయ్యో.. దాని పేరు రమ అండీ"

"పేరు ఎప్పుడు మార్చుకుంది?"

"దాని పేరు పుట్టినప్పటినుండీ రమే. పద్మ మన పిల్లల చిన్నప్పుడు చేసేది. మానేసింది."

"ఏమో.. నాకు ఆ పేరే గుర్తు" ఇలా ఆయన ఏ పనిమనిషి అయినా ఆ పేరుకే ఫిక్స్ అయి, అలాగే పిలుస్తారు.

నా స్నేహితురాళ్ళు లలితా, సుశీలా, సుమిత్రా, ఉమా కుడా, ఒకరు ఫోన్ చేస్తే ఒకరు చేసారని నాతో చెప్పి చివాట్లు తింటూవుంటారు.

మా ఇంటి ఎదురుగా ఇల్లు కట్టుకున్న ఆయనపేరు శేషగిరిరావు అయితే, ఆయన్ని ఎప్పుడూ సన్యాసిరావు అనే పిలిచారు. ఆయన పాపం భరించలేక "శేషగిరిరావు" అని పెద్ద నేమ్ ప్లేట్ కూడా పెట్టుకున్నాడు. అయినా మా ఆయన పట్టించుకోలేదు.

పెద్దవాడి 'వీసా' కోసం నేనూ, వాడూ అప్పట్లో చెన్నై వెళ్ళినప్పుడు, మా ఆయన ఫోన్ చేసి "బాడ్‌న్యూస్. మన ఎదురింటి సన్యాసిరావు పోయాడు" అన్నారు. ఆయన పోయినప్పుడు కూడా కరెక్ట్ పేరు చెప్పలేదు.

అదేం చోద్యమో ప్లాంట్‌లో ఆయన కింద పనిచేసే ఉద్యోగస్తులందరి పేర్లూ కరెక్ట్‌గా గుర్తుంటాయి. ఒక్కోసారి ఇద్దరి పిల్లల పేర్లు కూడా కన్‌ఫ్యూజ్ అవుతారు. నేను ఏదో గాంధారిలా కనేసినట్లు.

ఆఫీస్ వ్యవహారాల్లో ఆయనని కొట్టేవాడు లేడు అందులోనూ ఐ.టీ H.O.D. కానీ ఇంట్లో మాత్రం, ఓ వస్తువు బీరువాలో పెట్టి, కాసేపటికే తీసి, మంచం సొరుగులో పెట్టి, అక్కడ సేఫ్ కాదని, అల్మారాలో పెట్టి, మళ్ళీ తీసి డ్రాలో పెట్టి, చివరికి ఎక్కడ పెట్టారో, అవసరానికి కనపడక, అరిచి, యాగీ చేసి, నన్ను తిట్టి, ఇంటిల్లపాదీ వెదకడంలో బిజీ అయ్యాకా ఆయన టీ.వి పెట్టుకుని ఆన్‌లైన్ షాపింగ్‌లో ఏవేం అమ్ముతున్నారో చూసి ఆనందిస్తుంటారు.

ఆయనకి ఇంట్లో అందరం ఏక్టివ్‌గా ఉండడం ముఖ్యం. పిల్లలూ, నేనూ పడుకుని పుస్తకం చదువుకుంటూనో, టీ.వీ చూస్తూనో కనిపిస్తే ఆయనకి ఒళ్ళు మండిపోతుంది వంటగదిలోకి వెళ్ళి "నేను పకోడీలు చేస్తా" అని అరుస్తారు.

కాసేపటికే వచ్చి "ఉల్లిపాయ సన్నగా తరిగి పెడ్తావూ?" అంటారు. నేను వెళ్ళగానే ఆ పిండీ, పొయ్యి నాకు అప్పచెప్పి హాయిగా కంప్యూటర్ దగ్గర కూర్చుని 'టిక్కూ టిక్కూ' టైప్ కొట్టుకుంటుంటారు.

అంతెందుకు అరవై ఏళ్ళుదాటిన మా ఆడబిడ్డని "కొత్త పల్లీలు తెచ్చాను వలిచిపెట్టు. విత్తనాలు తెచ్చాను. పెరట్లో తవ్వి పాదులు చేసి వెయ్యి" అని చెప్పగలరు.

దగ్గర దగ్గర ఎనభై ఏళ్ళ మా అమ్మ కష్టపడి కింద ఇంట్లో నుండి పైకి మెట్లు అన్నీ ఎక్కి వచ్చేసరికి ఓసారి "ఓ సారి కిందకెళ్ళి అక్కడ నా స్పానర్ మర్చిపోయా తెచ్చి పెడ్తారా?" అన్నారు ఏదో రిపేర్ చేస్తూ.

"ఇక నావల్ల కాదు నాయినా. నేను వెళ్ళను" అంది.

ఇది చూసి మా అబ్బాయి పొట్టపట్టుకుని ఒకటే నవ్వు. అమ్మా "నాన్నకి పని చెప్పడానికి ఎవరైనా ఒకటే" అని.

మా చిన్నాడి ఫ్రెండ్ రోహిత్ ఈయన దగ్గర మహేంద్రాలో అప్రెంటీస్‌గా చేసాడు రెండు నెలలు. వాడు ఎప్పుడొచ్చినా ఈయన "రోహిత్ కమ్" అని కంపెనీ వ్యవహారాలన్నీ మాట్లాడేవారు. వాడు 'ఊ' కొడ్తూ రెండుగంటల పాటు ఓపిగ్గా వినేవాడు.

"పిల్లాడు అంటే అలా ఉండాలి" అనేవారు వాడిని మెచ్చుకుంటూ. మా పిల్లలయితే ఈయన పిలవగానే "నాన్నా.. నేను బిజీ" అని తప్పించుకుంటారు.

పక్కవాళ్ళు మామిడికాయలు మేము కోస్తున్నామని కొమ్మలు నరికేస్తే మళ్ళీ ఒక కొమ్మ ఇటొచ్చి కాస్తోంది. "మా ఆయన ఏమంటారంటే ఆ చెట్టుకి ఎరువు వెయ్యటంలేదు వాళ్ళు అందుకే పెద్ద కాయలు కాయటంలేదు. నేనో మనిషిని పెట్టి ఎరువు వేయిస్తానని చెప్పు" అంటారు. వాళ్ళసలు కాయలే కోసుకోవద్దు మొర్రో మేము చెట్టుని కొట్టేసుకుంటాం అంటుంటే ఈయన మనిషిని పెట్టి ఎరువేయిస్తానంటారు. మేము చేసే దొంగతనం కూడా ఆయన బట్టబయలు చేస్తారు.

ఆయనకి వున్న మరో సరదా ఇదివరకే చెప్పాగా, ఆదివారం వస్తే ఇంటినిండా పనివాళ్ళు వుండాలి. ఎలక్ట్రీషియనూ, ప్లంబరూ, పెయింటరూ, డ్రైవరూ అందరూ. ఇది మాత్రం నాకు అస్సలు నచ్చదు. నేను నిద్రలేచేటప్పటికి బాత్‌రూంలో ఇద్దరూ, హాల్లో ఇద్దరూ వుంటే ఎలా?

ఆయనకి ఎప్పుడూ చేతినిండా, మెదడునిండా పని ఉండాలి. రేపు రిటైర్ అయితే ఎలా? అని నాకు ఇప్పటినుండే బెంగగా వుంది.

కానీ ఆయనకి రాత్రి తొమ్మిదిన్నరకి ఠంచన్‌గా నిద్రొస్తుంది. అలాగే నాలుగింటికి మెలుకువ వస్తుంది.

ఆయన నిద్రలేచాక, నేను పడుకుని వుంటే ఆయనకి కోపం వస్తుంది. కానీ లేవమని నోటితో చెప్పరు. పదిసార్లు బెడ్ రూం తలుపు తీసి వేస్తారు. అది 'రాత్రి' సినిమాలో దెయ్యం తలుపులా "కిర్‌ర్‌ర్‌ర్‌ర్‌ర్"మని ఒకటే చప్పుడు. అప్పటికీ నేను లేవకపోతే, నాకాళ్ళ దగ్గర తన ఫైల్స్ అన్నీ పరిచి, కాయితాలు చూసుకుంటూ వుంటారు. అవి కాళ్ళకి తగిలితే దణ్ణం పెట్టుకోడానికి నేను లేచి కూర్చుంటాను.

ఏవీ తోచకపోతే పిల్లాడి పెళ్ళి గురించి మాట్లాడ్తారు. "ఎక్కడ చేద్దాం? ఎలా చేద్దాం?" అని.

"ఈ మధ్య పెళ్ళిళ్ళలో బౌన్సర్స్‌ని కూడా పెడ్తున్నారు అండోయ్" నేనే చెప్పాను.

"ఎవరైనా నలుగురు నల్ల షర్ట్‌లు వేసుకుంటే నువ్వు బౌన్సర్లు అనుకుంటావు" అని నవ్వారు.

నాకు ఇప్పటికీ నేను వెళ్ళిన ఓ పెళ్ళిలో బౌన్సర్‌లని ఎందుకు పెట్టారో అర్థం కాలేదు. ఆ పెళ్ళికి మా 'నేనేం చిన్నపిల్లనా?' హీరో రాహుల్ వచ్చాడు. అతన్ని చూసి నేనూ, నన్ను చూసి అతనూ హడావిడిగా ముందుకి వచ్చేలోగా, మధ్యలో తడికెలా ఈ బౌన్సర్ వచ్చి నిలబడ్డాడు. "మేడం.. ఎలా వున్నారు?" అని రాహుల్ నా దగ్గరకి రాబోతుంటే, ఈ బౌన్సర్ మధ్యలో కొచ్చాడు మళ్ళీ. నేను మోచేత్తో ఆ బౌన్సర్‌ని ఒక్క తోపుతోసాను. వెళ్ళి పక్కనే వున్న పానీపూరీ కుండ మీద పడ్డాడు.

నేనూ రాహుల్ జిలేబీలు తింటూ అతన్ని చూసి నవ్వుకున్నాం. ఈలోగా మా మధ్యలోకి ఓ మైక్ వచ్చింది. మైక్ ఎందుకూ? పాటపాడ్డానికా? అనుకున్నాను.

"ఈ పెళ్ళిలో మీ స్పందన ఏవిటి?" అంటోంది ఓ ఏంకర్.

చివరికి ఎవడి పెళ్ళిలోనో నా స్పందన ఎందుకూ? ఇవన్నీ చెపితే మా ఆయన తెగ నవ్వారు. "నువ్వా పెళ్ళికి సెలబ్రిటీస్‌ని పిలుస్తావుగా. బౌన్సర్స్‌ని పెడ్తావా?" అన్నారు. ఆ పెళ్ళి కొడుక్కి ఆ ఏజెన్సీ నడిపే అతను ఫ్రెండ్ అయివుంటాడులెండి. అని సర్ది చెప్పాను. ఒకరు మొదలు పెడితే ఈ పద్ధతి. వేలం వెర్రిగా అందరూ తెల్లారేసరికి మొదలు పెడ్తారు. అని నా మనసులో బెంగ.

మా పిల్లలకిలాగే 'నాన్న' అంటే చాలామంది పిల్లలకి జోక్స్ వచ్చేస్తుంటాయి. మా డైరెక్టర్ ఒకతను వాళ్ళ నాన్న పేరు మీద ప్రతినెలా డబ్బు పంపేవారట. తరువాత ఈయనకి ఎందుకు బాధ్యత అని భార్య ఎకౌంట్‌కి పంపడం మొదలు పెట్టాడుట. వాళ్ళ నాన్న ఆర్థిక శాఖ కోడలికి బదిలీ అయిందని తెలిసి, ఆ అమ్మాయిని మంచి మాటలు ఆడ్డానికీ, ప్రసన్నం చేసుకోడానికీ దగ్గర కూర్చుని "మీ అన్నయ్య ఎలా ఉన్నాడమ్మా?" అన్నారట.

"బానేవున్నాడు మావయ్యగారు" అందట.

"బొత్తిగా నల్లపూస అయిపోయాడు. ఓసారి రమ్మనమ్మా"

"అలాగేనండీ"

"అలాగే అంటేకాదు. ఎంతకాలం అయింది చూసి, చూడాలని వుంది ఓసారి రమ్మనమ్మా"

"వీలు చూసుకుని రమ్మంటాను మావయ్యగారు"

"వీలు చూసుకుని కాదు. మావయ్యగారు నీ మీద బెంగెట్టుకున్నారు. వెంటనే రమ్మని చెప్పు."

ఇదంతా వింటున్న మా డైరెక్టర్‌కి ఒళ్ళుమండి "నేను ఇంటికి దూరంగా చాలాకాలంగా వున్నాను. నామీద బెంగలేదా నీకు, ఒక్క ఫోన్ కూడా చెయ్యలేదు. నీ బావమరుదులతో నాకు రక్తసంబంధం. వాళ్ళతో మాట్లాడవు కానీ ఇప్పుడు నా బావమరిది మీద నీకు అంత బెంగొచ్చిందా! నీ బావమరుదులు నలుగురు మీదా నాకు చాలా బెంగగా వుంది రేపు రమ్మను చూస్తాను" అని అరిచాడుట.

ఇంతకీ కోడలి 'అన్న'ని చూడాలనుంది అంటే ఆ అమ్మాయి సంతోషిస్తుందని ముసలాయన ఆశ.

నిన్న మా అన్నయ్య ఇంటికి వెళ్ళేసరికి మా మేనల్లుడు వాళ్ళ నాన్నమీద ఎగుర్తున్నాడు.

"అందులో తప్పేం వుంది?" అంటోంది మా వదిన. ఇంతకీ జరిగిందేవింటంటే, మా వాడి గర్ల్ ఫ్రెండ్ అమ్మకి 'హాయ్' అని ఎఫ్.బిలో మెసేజ్ పెట్టాడుట, "వెంటనే డీ ఏక్టివేట్ అవమను" అని అరుస్తాడు వాడు.

"హాయ్" అంటే తప్పేవిట్రా? అంటుంది మా వదిన.

"తప్పే. ఆవిడ నా ఫియాన్సీ మమ్మీ" అంటాడు వాడు.

పిల్లలకి 'నాన్న' అంటే బొత్తిగా గౌరవంలేదు అనుకోడానికీ వీల్లేదు.

మా పిల్లలకి వాళ్ళ నాన్న తెల్లవారుఝామున ఆఫీస్‌కి వెళ్తుంటే, ఆయన డ్రైవ్ చేసుకుని వెళ్ళడం ఇష్టం వుండదు. లేచి ఆఫీ బస్సుదాకా ఎవరో ఒకరు దింపుతాం అంటారు. ఆయనకి ఖరీదైనా బ్రాండెడ్ షూస్, బట్టలూ కొనాలనీ, హాలిడేకి టికెట్ కొని విదేశాలు తిప్పాలనీ చూస్తారు. ఆయనంటే చనువుతో కూడిన, భక్తితో కూడిన, భయంతో కూడిన ప్రేమ. కానీ వీళ్ళకీ ఎక్స్‌ప్రెస్ చెయ్యడం రాదు. ఆయనకీ వీళ్ళ మీద బెంగని చెప్పడం రాదు.

"వాడిని వీడియో చాట్ చెయ్యమను. చూడాలి" అంటారు. వాడు రాగానే "ఆ గెడ్డం ఏవిట్రా? అసలే ట్రంప్‌కి కోపం. తీసెయ్. ప్రమాదం. బొత్తిగా మీకు భయంలేదు" అని అరుస్తారు.

లేదా ఓసారి "లేచావా? ఆఫీస్‌కి వెళ్ళవా? ఇంక చాలు. పడుకో. గుడ్‌నైట్" అంటారు.

"దీనికా నన్ను నిద్రలేపింది?" అని వాడు విసుక్కుంటాడు.

ఆయన వాళ్ళతో మాట్లాడ్తుంటే నాకు ఇవే వినపడ్తాయి. "నీ కారు తుడుచుకుంటున్నావా? నీ బాత్‌రూం రోజూ కడుక్కుంటున్నావా? నీ జుట్టు కత్తిరించుకో.. రోజూ గెడ్డం చేసుకో. సేవింగ్స్ చేస్తున్నావా? ఇన్సూరెన్స్ చేసావా? కారు సర్వీసింగ్‌కి ఇచ్చావా? డాక్టర్ దగ్గరకి చెకప్‌కి వెళ్ళావా?"

"ఎప్పుడూ అలా హెడ్‌మాస్టారులా ప్రశ్నలు వేసి క్లాసులు పీకితే ఎలాగండీ?" అంటుంటాను.

మా పిల్లలకి వాళ్ళ నాన్న మీద పెద్ద కంప్లైంట్ 'నరసింహ్మా' అనే ఆయన కొలీగ్ కొడుకుతో పోల్చడం. వాడికి ఇంజనీరింగ్‌లో ఫ్రీ సీట్ వచ్చింది. మెరిట్ వచ్చింది. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ వచ్చింది. పెళ్ళయింది. పిల్లాడు పుట్టాడు. ఇలా అన్నీ కంపేరిజనే.

అసలు మా పెద్దాడి మాటల ప్రకారం "పుట్టగానే వీడు ఇంకా ఏడవలేదు. పక్క బెడ్ మీద వాడు ఏడ్చేసాడు- అని పోల్చి కోపంగా చూసారు డాడీ" అని జోక్ చేస్తాడు.

"అన్నీ అమ్మ బుద్ధులు. ఆవిడ అలవాట్లు" అని వాళ్ళని కోప్పడాలంటే మొదట నన్ను కలిపి తిడ్తుంటారు.

"నాన్న ఎప్పుడైనా మమ్మల్ని వేరేవాళ్ళ నాన్నల్లా మెచ్చుకుంటారా? మరి మేమూ ఆ మహేష్ నాన్నతో పోల్చాలా? కార్తీక్ వాళ్ళ నాన్నతో పోల్చాలా?" అంటారు వీళ్ళు.

నేను ఆయనకి ఏవైనా చెపితే "నువ్వు చేస్తున్న గారాబం చాలు" అంటారు.

వీళ్ళకి చెపితే "ఆయనకి మేము తప్ప అందరూ కరెక్ట్‌గా కనిపిస్తారు" అంటారు.

నేను ఎటూ చెప్పలేను

ఇది ఎన్ని ఇళ్ళల్లో జరుగుతుందో కానీ నాన్నలు అంతేనేమో అనుకునేదాన్ని. భారవి కథలోలాగా.

ఓసారి రైల్లో తిరుపతి వెళ్తున్నాం నేనూ ఆయనా. నేను నిద్రపోతున్నాను. ఈయన ఎదురు సీటు ఆయనతో మాట్లాడుతున్నారు. ఆయనా, ఆయన భార్యా కూడా డాక్టర్లేట.

నాకు మధ్యలో నిద్రమెలుకువ వచ్చినా ఇంకా కళ్ళు తెరవలేదు. మా ఆయన చెప్తున్నారు "మా పిల్లలిద్దరూ చాలా జెమ్స్. వాళ్ళకి అన్నీ తెలుసు. వెల్ డిస్ప్లిన్డ్! మాకేం బెంగలేదు వాళ్ళిద్దరి గురించి. వాళ్ళ అమ్మలాగే చాలా పట్టుదల. కష్టపడే తత్వం." నేను నవ్వుకుంటూ, కళ్ళు మూసుకునే పడుకున్నాను ఇంకా చెప్తుంటే విందామని.

Post your comments




